# ఆత్మీయులు

'సర్ర్ర్..ర్..'మన్న శబ్దంతో కారును సడన్‌గా ఆపాడు క్యాబ్‌డ్రైవర్. వెనక సీట్లో కూర్చున్న కావేరి ఉలిక్కిపడి ముందుకు చూసింది.

ఎవరో ఒక నడివయస్కురాలు.. కొద్దిలో ప్రమాదం నుండి బయటపడింది. ఏ ధ్యాసలో ఉందో రోడ్డును దాటుతూ కారుకు అడ్డుపడింది. అప్పటికే అదుపుతప్పి రోడ్డుమీద పడిపోయింది. కావేరి ఆందోళనగా డోర్ తెరుచుకొని కిందకు దూకింది. ముందుకురికి పడిపోయిన ఆమెను పైకిలేపబోతూ ఆశ్చర్యానికి గురైంది.

ఇంకా చీకట్లు తొలగిపోని ఆ వేకువలో స్ట్రీట్‌లైట్ వెలుతురుకు వెంటనే గుర్తించింది కావేరి. ఆమె సుభద్రాంటి. కావేరి స్నేహితురాలి తల్లి. "ఆంటీ.. మీరా.. ఏమైంది? ఈ టైమ్‌లో ఇలా.." ఆందోళన, ఆశ్చర్యం కలగలిసిన గొంతుకతో ప్రశ్నించింది కావేరి.

సుభద్ర సర్దుకుంటూ లేచి నిలబడింది. "చిత్ర..! చిత్ర.. ఆసుపత్రి.. " అంటూ రోడ్డుకు ఆవలివైపు చూపిస్తూ అలజడిలో ఉన్నదాన్లా మాటలు వెతుక్కొంటుంది. క్యాబ్‌డ్రైవర్ అలాగే వాహనాన్ని పక్కన నిలిపి చూస్తున్నాడు.

కావేరికి అర్థమై కానట్టు అనిపిస్తుంటే ఆమెను పక్కకు తీసుకెళ్లి గద్దెపైన కూచోబెడుతూ "దెబ్బలేమైనా తగిలాయా ఆంటీ..?" అంది. ఆమె లేదన్నట్టు తల ఆడించింది. ఆమె స్థిమితపడేదాకా ఆగి "చిత్రకేమైంది ఆంటీ..? ఇంతపొద్దున్నే ఎక్కడి కెళ్లారు?" అడిగింది నిదానంగా.

సుభద్ర మొహంలో బాధాపూరితమైన మార్పు చోటుచేసుకుంది. అప్పటికి కోలుకున్నదాన్లా "కావేరీ.. వచ్చావా..? నాకు తెల్సు.. నువ్వు వస్తావని. చిత్ర.. ఇంతపని చేస్తుందని నువ్వు ఊహించావా..?" అంది ఆందోళన నిండిన స్వరంతో.

కావేరికేమీ అర్థం కాలేదు. "ఏమైందాంటీ చిత్రకు?" రెట్టించింది. సుభద్ర గొణిగినట్టుగా అంది.. "ఆత్మహత్యా యత్నం చేసింది".

కావేరి షాక్‌కు గురైనదాన్లా కొన్నిక్షణాలు మాట్లాడలేకపోయింది. తర్వాత తమాయించుకొంటూ "ఎక్కడుంది ఇప్పుడు.." అంది ఆదుర్దాగా.

రోడ్డుకు అటువైపునున్న శాంతి హాస్పిటల్‌వైపు చేయి చూపించింది సుభద్ర. కావేరి టైమ్ చూసింది. ఇంకా గంటన్న ర సమయముంది ట్రెయిన్‌కు. రైల్వే స్టేషన్‌కు ఇక్కన్నుండి నడుచుకుంటూ వెళ్లొచ్చు. క్యాబ్ అతనికి పేమెంట్ ఇచ్చేసి వెళ్లిపొమ్మంది. బ్యాగ్ తీసుకొని "పదండి ఆంటీ.. " అంది. ఆమె వెంటనే లేచి "ఇంజక్షన్ తీసుకెళ్లాలి. ఇందాక పగిలి పోయింది రోడ్డుమీద" అంది.

కావేరికి విషయం స్పష్టమైంది. రోడ్డుకు ఇటుపక్కనున్న ఒకేఒక్క మెడికల్ షాపు రాత్రిళ్లూ తెరిచి ఉంటుంది కనుక మసిమబ్బువేళలో ఆమె ఈవైపు వచ్చింది. కావేరి ఆమెచేతిలో మెడికల్‌స్లిప్ అందుకొని "నేను తెస్తాను ఇక్కడే ఉండం డి" అంటూ మెడికల్ స్టోర్‌వైపు పరుగెత్తింది. మూడు నిముషాల్లో తిరిగొచ్చి "పదండి.." అంది.

రోడ్డుకు కుడివైపున 'శాంతి హాస్పిటల్స్' అని పెద్దలైట్లతో వెలుగుతోంది. ఇద్దరూ అటువైపు అడుగులేస్తుంటే కావేరి మనసులో ఎన్నెన్నో ప్రశ్నలు.

చిత్ర! చిత్ర ఎందుకు ఆత్మహత్య చేసుకోబోయింది? తనకేమీ పెద్దగా కష్టాలుకూడా లేవే?! చిన్నప్పట్నుండీ తన-కున్న అతికొద్దిమంది స్నేహితుల్లో చిత్ర ఒకరు. ఇంటర్మీడియట్ వరకు కలిసి చదువుకున్నారు. ఒకరి గురించి ఒకరికి తెల్సు. ఐనా తను సూసైడ్ అటెమ్ట్ దాకా వెళ్లిందంటే.. తనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయన్నమాట' అనుకొంది కావేరి.

ఏం జరుగుంటుంది?

లిఫ్టులో పైకి తీసుకెళ్తుంది సుభద్ర.

వీళ్లేమీ పేద, మధ్యతరగతి కుటుంబీకులేమీ కాదు. మమ్మీలాగే ఆంటీ కూడా జాబ్ చేస్తుంది. అంకుల్‌కు పెద్దపెద్ద బిజినెస్‌లున్నాయి. చదువులోనూ ఎప్పుడూ ముందుండే చిత్రకు పెద్దగా సమస్యలేమీ లేవు. కాకపోతే వాళ్లమ్మానాన్నలు కాస్త క్రమశిక్షణకు ప్రాధాన్యతిస్తారు. మరి ఆత్మహత్యాయత్నానికి కారణం?!

లిఫ్ట్ నాలుగో ఫ్లోర్‌లో ఆగింది. సుభద్రతో కలిసి గదిలోకి వెళ్లింది. లోన బెడ్‌పై పడుకొనున్న చిత్రకు ఇద్దరు నర్సులు సెలైన్ బాటిల్ ఎక్కిస్తున్నారు. ఓపక్కన చిత్ర తమ్ముడు శ్రీకాంత్ బిత్తరపోయి కూర్చొని ఉన్నాడు. లోనికి అడుగు పెట్టగానే "ఒక ఇంజక్షన్ కోసం ఇంతలేటా..?" అంటూ కావేరి చేతిలోనున్న ఆంపుల్‌ను లాక్కొని సిరంజ్‌లో లోడ్ చేసింది నర్సు.

చిత్ర మగతలో ఉంది. తను తాగిన బాత్‌రూమ్ క్లీనర్ హార్పిక్‌ను కక్కించేందుకు స్టమక్‌వాష్ చేశారు హాస్పిటల్ వాళ్లు. ఇంకాపూర్తిగా స్పృహలోకి రాలేదు. నర్సు సూదిమందును సెలైన్‌లోకి ఎక్కించగానే మగతలో ఉన్న చిత్ర మరింత గాఢతలోకి వెళ్లింది. కావేరి ఆత్రంగా వెళ్లి చిత్ర పక్కనే కూర్చొంది. కానీ తనిప్పుడు ఎవరొచ్చిందీ గుర్తించే స్థితిలో లేదు.

"ప్రమాదం ఏమీ లేదుకదా ఆంటీ" అంది కావేరి. సుభద్ర లేదన్నట్లు తలఊపింది. "నిద్ర పోనీండి.. ఎవరూ లేపొద్దు. ఏదైనా అవసరం పడితే పిలవండి" అంటూ నర్సులిద్దరూ వెళ్లిపోయారు.

గదిలో గాఢ నిశబ్దత అలుముకొంది. సుభద్ర నిస్తేజమైన చూపుల్తో మౌనంగా కూర్చొని కూతురువంకే చూస్తోంది. "అంకుల్ లేరా ఆంటీ.." అంది కావేరి నిశ్శబ్దాన్ని చీల్చుతూ.

"లేరు. బెంగుళూరెళ్లారు రెండ్రోజుల క్రితం. ఇంకో మూడ్రోజుల వరకు రారు. ఆయన్నెందుకు టెన్షన్ పెట్టాలని చెప్ప లేదు కూడా.."

అదీ మంచిదేలెండి అనుకొంది. "నాకు తెలియని సమస్యలు ఏమున్నాయాంటీ చిత్రకు? అసలేం జరిగింది??" తెలుకునేవరకూ మనసు స్థిమితమయ్యేలా లేదు కావేరికి. రాకేష్ ట్రెయిన్‌టైమ్‌కు అరగంట ముందు వస్తానన్నాడు స్టేషన్‌కు. అతనొచ్చేలోపే వెళ్లాలని ఒకవైపు! ఇక్కడ ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లిన బాల్యస్నేహితురాలికి ఏంజరిగిందో తెల్సుకోవాలనే ఆత్రుత ఇంకోవైపు. ఉబలాటాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తూ "నాకు చెప్పకుండా ఇంకా ఎవరికి చెబుతారు ఆంటీ..?" అంది.

సుభద్ర గొంతు సవరించుకొని చెప్పడం మొదలుపెట్టింది.

++++++++++

చిత్రవాళ్లది చిన్న కుటుంబం. అమ్మానాన్నలు సుభద్ర నటరాజన్‌లు, తమ్ముడు శ్రీకాంత్ ఉన్నారంతే. పిల్లల విషయంలో చిత్ర తల్లిదండ్రులు మొదట్నుండీ స్ట్రిక్టుగానే ఉండేవారు. చిత్ర క్రమశిక్షణలోనే పెరిగింది.

చిన్నప్పుడు చాక్లెట్ కావాలంటే.. 'చాక్లెట్ తింటే దగ్గు లేస్తుంది' అని ఆ ఆలోచన మాన్పించేది సుభద్ర. ఐస్‌క్రీం తింటానంటే జలుబు చేస్తుందని వారించేది. చిత్రకు పాలు ఇష్టం లేకుంటే 'చిన్నపిల్లలు పాలు తప్పనిసరిగా తాగాలని బలవంతంగా తాగించేది.

పెద్దయ్యాక స్నేహితుల్తో కలిసి పిజ్జాలు, బర్గర్‌లు తింటుంటే చూసి ఇంటికొచ్చాక క్లాస్ తీసుకుంది. బేకరీ ఫుడ్స్ తింటే లావెక్కుతారని, అవంత ఆరోగ్యానికి మంచివికావని హితబోధ చేసింది. ఇంటర్మీడియట్‌లో ఓరోజు క్లాసులు నడవనివేళ.. ఫ్రెండ్స్‌తో కలిసి చెప్పకుండా సినిమాకెళ్లినందుకు తండ్రికి చెప్పి మరీ తిట్టించింది. కొందరు స్నేహితులకు ఆంక్షలు విధించింది కూడా. ఎట్లాంటి సినిమాలకెళ్లాలో, ఎవరితో కల్సివెళ్లాలో కూడా తానే నిర్దేశించేది.

ఇదంతా చిత్ర సరిగా అర్థం చేసుకోలేకపోయింది. చిత్రేకాదు, ఆ వయసులోనున్న ఏపిల్లలూ ఈ విషయాన్ని సరిగా అర్థం చేసుకోలేరు కూడా. బోడిపెత్తనంతో తమను అదుపులో పెడుతున్నారనుకొంటారు. అందరు తల్లిదండ్రుల్లా కాకుండా తమవారు ప్రేమ లేనివారనుకుంటారు.

చిత్రకూడా అట్లాగే అనుకొంది.

హైస్కూల్ చదువుతున్నదశలో స్కూల్‌బస్ అనుకూలంగా లేకపోయేసరికి సొంతంగా ఆటోను కుదిర్చారు. సమయానికి స్కూల్లో దిగబెట్టడం, మళ్లీ సాయంత్రం ఇంటికి చేర్చడం ఆ ఆటోవాలా పని. అప్పటికి రెండు ఆటోలు మార్చారు.

తొమ్మిదో తరగతిలో ఓరోజు స్కూల్‌కు బయలుదేరిన చిత్ర మొహంచూసి ఏదో అయిందని గ్రహించాడు ఆటో అబ్బాయి శామ్యూల్. దార్లో బేకరీ దగ్గర ఆటో ఆపి చాక్లెట్ కొనిచ్చాడు.

చిత్ర మొహం వెలిగింది. "థాంక్యూ శామ్యూల్" అంది. చాక్లెట్‌ను తీసుకొని మనసారా తిన్నది. మరోరోజు చిత్ర మూడ్‌ను గ్రహించి అదే బేకరీ దగ్గర ఐస్‌క్రీం కొనిచ్చాడు. ఆమె పులకించిపోయింది. "శామ్యూల్, నాకెందుకు ఐస్‌క్రీం కొనియ్యాలనిపించింది..?" అంది గోముగా.

"మీ అమ్మతోటి ఐస్‌క్రీం కోసం వాదులాడంగ చూసిన.." అన్నాడు. చిత్ర మొహం ఏదోలాపెట్టి "ఏమో శామ్యూల్! సొంత కూతురికి ఐస్‌క్రీం అడిగితేకూడా కొనియ్యని పేరెంట్స్ నాకే ఉన్నారు.." అంది బాధపడుతున్నట్లు.

"పోనీలే చిత్రా! గంతదానికి బాధెందుకు? నేనున్నానుగదా! నీకేది గావాలన్నా చెప్పు. నేను కొనిస్తా.." అన్నాడు.

ఆమెకు హాయిగా అనిపించింది ఆమాట. తన ఇష్టాల్ని గుర్తించే వ్యక్తి ఒకరున్నారు అనుకొంది. ఆరోజు నుండి వస్తూపోతున్నప్పుడు చాక్లెట్లో, కేకో, సమోసో.. ఏదో ఒకటి అతను కొనియ్యడం.. చిత్ర తీసుకొని సంతోషపడడం జరుగుతూవస్తుంది. కాలక్రమంలో వాళ్లమధ్య స్నేహం బలపడింది.

ఇంటర్మీడియట్ చదువుతున్నప్పుడు సెలవురోజు చిత్ర తన స్నేహితుల్తో సినిమాకు వెళ్తానంది. తల్లి వద్దంది. "పరీక్షలు దగ్గరకొస్తున్నాయి. సెలవురోజు ఇంట్లో చదువుకోవాల్సిందిపోయి సినిమాలేంటి..?" అంది.

ఆరోజంతా చిత్ర బాధపడుతూనే ఉంది. మరునాడు కాలేజ్‌కి వెళ్తున్నప్పుడు శామ్యూల్ అడిగాడు. "చిత్రా! ఏమైంది? అట్ల డల్‌గా ఉన్నవ్..?"

ఎవరికో ఒకరికి తన బాధ చెప్పుకోవాలనే తపనలో ఉన్న చిత్ర.. ఇంట్లో తనను సినిమాకు వెళ్లకుండా అడ్డుకొన్న విషయం చెప్పింది.

"ఓస్.. అంతేనా? నీకు సినిమా చూడాల్నుందా.. నేన్ చూపిస్త.." అన్నాడు.

ఆమె ఉత్సుకతగా ముందుకువంగి "నిజమా.. అదెట్లా సాధ్యం? సెలవురోజు బయటకు వెళ్లనీయరుగదా.. మమ్మీ డాడీ.." అంది.

"సెలవురోజు వెల్లనీయరు. కాలేజికి డుమ్మాగొట్టి పోవాల. మల్ల కాలేజ్ అయిపోయే టైంకు ఇంటికిబోవాల.." అన్నాడు శామ్యూల్.

ఆమె కొంత ఉత్సుకత, కొంత సందిగ్ధతలో "ఇంట్లో తెలిస్తే కాళ్లిరగ్గొడతారు.." అంది.

"తెల్వనియ్యం గదా! కాలేజికి లివ్‌బెట్టు. లెటర్ నేనిచ్చేత్త.."

అంతే! ఆమెలో ఉత్సాహం ఉరకలెత్తింది. ఆరోజు అతన్తో కల్సి సినిమాకెళ్లింది. ఇంటికెళ్లడానికి ఇంకా సమయం మిగిలితే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కెళ్లి తమకిష్టమైనవన్నీ తిని మెల్లగా ఇంటికి బయలుదేరారు.

వస్తుంటే "శామ్యూల్.. మా పేరెంట్స్‌కి నామీద నీకున్నంత ఇష్టం ఉండిఉంటే ఎంత బాగుండేదో..!" అంది నిర్లిప్తంగా

అతను ఆమెను ఓదారుస్తున్నట్లు ఆమె భుజంమీద చేయివేశాడు. ఆరోజునుండి వాళ్లకు సినిమాలు, షికార్లు సాధారణమయ్యాయి. ఇద్దరిమధ్య స్నేహం మరింత ముదిరింది. తర్వాత డిగ్రీలో కూడా కాలేజ్‌కి వెళ్లొచ్చేందుకు అతని ఆటోనే కొనసాగించేలా చూసుకొంది.

ఆరోజు .. చిత్ర పుట్టినరోజు.

తండ్రి బిజినెస్ పనిమీద పూణె వెళ్లాడు. తల్లి సుభద్రకు ఆరోజు సాయంకాలం హెడ్డాఫీసులో తప్పనిసరి హాజరు కావాల్సిన మీటింగ్ ఉంది. రాత్రయినా కావచ్చు. అదే విషయాన్ని చిత్రకు చెప్పి "ఈసారి బర్త్‌డే స్వీట్స్ పంచడంతోనే సరిపెట్టుకోమ్మా! వచ్చేయేడు ఘనంగా చేసుకుందాం.." అని చెప్పి ఆఫీసుకెళ్లింది.

అది విన్న శామ్యూల్ ఆరోజు సాయంత్రం కాలేజీనుండి ఆమెను ఒంటరిగా ఉంటున్న తన ఫ్రెండ్ ఇంటికి తీసుకెళ్లాడు. అప్పటికే అక్కడ పెద్దకేక్‌తో సహా బర్త్‌డే ఏర్పాట్లు చేసిపెట్టాడు. ఇంట్లో వాళ్లిద్దరేతప్ప ఫ్రెండ్ కూడా లేడు.

చిత్ర ఉబ్బి తబ్బిబ్బయిపోయింది.

తనకోసం... తనకోసం.. ఇంత గ్రాండ్‌గా బర్త్‌డే సెలబ్రేట్ చేస్తున్న ఈ మనిషి తనకేం అవుతాడు? తన తల్లిదండ్రులకు లేని పట్టింపు ఇతగాడికెందుకు? నేనంటే ఇతనికి అంతప్రేమా..??

తనకు 'చిత్ర'ంటే ఎంతిష్టమో చేతల్తో చూపించాడతడు. ఆమె చేతినిపట్టి, పక్కనే ఉండి కేక్ కట్ చేయించాడు. తన స్వహస్తాల్తో తినిపించాడు. మనసులో పొంగిపొర్లుతున్న ఆనందంతో ఆమె కూడా కేక్‌ముక్కను అతని నోట్లో పెట్టింది. ఇద్దరి హృదయాల్లో చెప్పరానంత ప్రేమ పెల్లుబికింది.

అతనన్నాడు "ప్రతి సంవత్సరం ఇట్ల నీ బర్త్‌డేను నేనే పక్కనుండి చేయాలనిపిస్తంది."

"నాకూ.. నీపక్కనే బర్త్‌డే జరుపుకోవాలనుంది.."

అంతే! ఇద్దరిమధ్య అన్యోన్యత మరింత ఘాడతై పరిమళించింది. ఆమె పురివిప్పిన నెమలియై నాట్యమాడింది. మనసులు కలిసిన చిత్ర,శామ్యూల్ ఒకర్ని విడిచి ఒకరు ఉండలేని స్థితిలోకొచ్చారు.

ఇంటికెళ్లేసరికి రాత్రయింది. అప్పటికే ఇల్లుచేరిన సుభద్ర రుద్రతాండవం చేసింది. ఆటోవాడితో స్నేహం గురించి తమ్ముడు తల్లి హృదయాగ్నిలో ఆజ్యం పోశాడు. అగ్గిమీద గుగ్గిలమైన తల్లి, కూతురును ఎడాపెడా చరిచింది. తను ఇంత క్రమశిక్షణతో పెంచినా తన కూతురు బరితెగించిందే అన్న కసితో ఇష్టమొచ్చినట్లు కొట్టింది. ఆటోవాన్ని ఏదన్నా తమ పరువే పోతుందనే భయంతో అతన్ని మళ్లీ తన ఇంటివైపు కన్నెత్తిచూడొద్దని హెచ్చరించి సాగనంపింది.

తల్లి చేతిలో చావుదెబ్బలుతిన్న చిత్ర రాత్రంతా ఏడుస్తూనే ఉంది. తెల్లవారినుండి ఆమె దాదాపు గృహనిర్బంధానికి గురైంది. భర్త రాగానే ఇద్దరూ కలిసి చర్చించి చిత్రను కాలేజీ మాన్పించివేశారు. ప్రైవేటుగా డిగ్రీ రాయించాలని నిర్ణయించారు.

చిత్ర మాత్రం శామ్యూల్‌ను కలుసుకోవాలని తహతహలాడుతూనే ఉంది.

ఈ దశలోనే శామ్యూల్ ఏకంగా 'ఇద్దరంవెళ్లి చర్చిలో పెళ్లి చేసుకుందామ'ని వర్తమానం పంపాడు. అతని ఆలోచనల్లోనే మునిగితేలుతున్న చిత్ర ఆరాత్రి చెప్పాపెట్టకుండా అతన్తో వెళ్లిపోయింది.

పరువే పరమావధిగా బ్రతికిన ఆ తల్లిదండ్రులు కంటికి మింటికి ఏకధాటిగా విలపించారు. పోలీస్ రిపోర్టు ఇస్తే తమ కుటుంబపరువు పూర్తిగా గంగలో కలుస్తుందని, ఆత్మీయుల్ని నలుగుర్ని వెంటేసుకొని అన్నిచోట్లా గాలించారు. చిత్ర ఆచూకీ తెలియలేదు. చివరకు పోలీస్ రిపోర్టిచ్చినా ఫలితం లేకుండాపోయింది.

అయితే సరిగ్గా వారం రోజులకు.. చిత్ర.. తనే వచ్చింది. వాడిన పూబంతిలా..!

++++++

సుభద్ర చెప్పడం ఆపింది.

హాస్పిటల్ గదిలో నిశ్శబ్దం తాండవిస్తుంది.

చిత్ర.. తన కుటుంబ సభ్యులకంటే ఆటోవాలాను ఎక్కువ ఇష్టపడుతుందన్న విషయం తనకు తెలిసిందే అనుకొంది కావేరి. కానీ తరువాతి పరిణామాలు తెలియవు. అందుకే.."తర్వాత.. తర్వాత ఏం జరిగింది ఆంటీ..?" అంది ఉద్విగ్నంగా

"వాస్తవం తనే గ్రహించింది"

"ఏంటా వాస్తవం..??"

"తమ ఆరోగ్యం, భద్రత కోసం తల్లిదండ్రులు చేసే నియంత్రణను పిల్లలు ప్రేమరాహిత్యంగా భావించి, బయటి వ్యక్తులు దురుద్దేశంతో అందించే తాయిలాలను ప్రేమకానుకగా భావిస్తే.. నిండుజీవితం బండలవుతుందని తానే స్వయంగా గ్రహించింది"

"ఎట్లా...?"

"పెళ్లి పేరుతో తీసుకెళ్లి వారం రోజులపాటు కాపురం పెట్టాడు ఆటోఅబ్బాయి. చిత్ర పెళ్లిప్రపోజల్ తీసుకొస్తే.. 'మీ అమ్మానాన్నలు ఇష్టపడి మనిద్దరికీ పెళ్లిచేస్తేనే చేసుకునేది' అని లంకె తగిలించాడు.

'ప్రాణంపోయినా అమ్మానాన్నలు ఒప్పుకో'రన్నది చిత్ర.

'అయితే పెండ్లి విషయం ఆలోచించుడు మానుకో' అన్నాడు.

'పెండ్లి కాకుంటే తనను లేపుకొచ్చినట్లవుతుంది కదా' అంది చిత్ర.

'ఎట్లైతేంది? మీవోళ్లు పెండ్లి చేత్తమని వొచ్చెదాంక గిట్లనే కలుసుందాం. నీదగ్గర పైసలు, నగలు ఉన్నయ్‌గదా! గవ్వి అయిపోయేదాంక బేఫికర్. నాకా ఉద్యోగం, సదువు లేదు. మీవోళ్లను కాదని లగ్గం జేసుకొని నేను సాధించేదేంది?'

'నీకు కావాల్సింది నేనా.. మావాళ్లా..?'

'ఉత్త నువ్వుకాదు. మీ అమ్మనాన్నలతో కలిసున్న నువ్వు..' అతను నవ్వాడు.

చిత్రకు వాస్తవం అర్థమైంది. అతనిది ప్రేమ కాదని, కేవలం స్వార్థమని గ్రహించిన వెంటనే అతన్ని కాదని వచ్చేసింది" వివరంగా చెప్పింది సుభద్ర.

గాఢంగా నిట్టూర్చింది కావేరి. "మరి అతనిమీద ఏం చర్యలు తీసుకోలేదా ఆంటీ..?"

"ఏంటి తీసుకునేది? తప్పు చిత్రవైపు కూడా ఉందికదా?"

"అదిసరే.. తప్పుతెల్సుకొని ఇంటికొచ్చిందికదా! మరి ఈ సూసైడ్ అటెమ్ట్ ఎందుకు?" కావేరీలో సందిగ్ధం అట్లాగే ఉంది.

సుభద్ర చాలాసేపు మౌనంగా ఉండిపోయి నెమ్మదిగా అంది. "చిత్ర... గర్భవతని తేలింది".

కావేరి ఉలిక్కిపడింది. కాసేపు ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. తర్వాత సంశయిస్తూనే అంది. "ఈ పరిస్థితుల్లో.. అతన్తో పెళ్లికి ప్రయత్నిస్తే ఎట్లా ఉండేదాంటీ...? అతనికి ఉద్యోగం లేకున్నా.. మీరే ఏదన్నా దారిచూపించి..." తర్వాత ఏం మాట్లాడాలో తెలియలేదు.

"కావచ్చు.! కానీ.. అతనికి అప్పటికే పెళ్లై చాలారోజులైంది."

బాంబ్ పేలినట్లు అదిరిపోయింది కావేరి. "ఏంటీ...??"

సుభద్ర మాట్లాడలేదు. కావేరి హృదయం బడబానలంలా రగులుతుంది.

పెళ్లైన వ్యక్తే.. ఓ చదువుకునే అమ్మాయిని నమ్మించి గొంతుకోశాడా? పెళ్లిచేసుకుందామని పిలిచి వారంరోజులు కాపురం చేసి వదిలివేశాడా? అయినా వదిలేసింది అతడు కాదు. చిత్రే అతన్ని వదిలించుకొని వచ్చింది.

మరి వదిలించుకోక..?!

'అమ్మానాన్నల ఆస్తితోకూడిన చిత్ర' కావాలన్నాడంటే.. అతడెంత అవకాశవాది..? ఒక ఆటోవాలాను నమ్మి బయటకుపోతే సరైన గుణపాఠమే నేర్పాడు మరి!

దీనిద్వారా ఏమర్థమవుతుంది?? నియంత్రించినా..పిల్లలకు ఒకదశవరకు తల్లిదండ్రులే అసలైన భద్రత అనికదా!!

మరి.. తను?! తను చేస్తున్నదేమిటి..??

ఒక కారుడ్రైవర్‌తో లేచిపోవడానికి సిద్ధపడింది.

పెంపకంలో అమ్మానాన్నలు అనుసరిస్తున్న నియంత్రణను బంధనంలా భావించి, తనింటి కారు డ్రైవర్ ప్రదర్శిస్తున్న ఆసక్తిని ప్రేమగా భావించింది. అతడందించే తాయిలాలకు తల్లిదండ్రులకంటే అతడే ఆత్మీయుడుగా, ఆలంబనగా భావించింది. అతడు స్మార్ట్‌ఫోన్ కొనిస్తే తీసుకుంది. అతను తీసుకెళ్తే సినిమాకెళ్లింది. అతన్తో గుడికెళ్లింది. అతన్తోనే ప్రేమలో పడింది.

అమ్మానాన్నలు పెట్టే ఆంక్షలు కాస్త ఎక్కువే అయ్యుండొచ్చు. కానీ తమ పిల్లలకు ఎప్పుడు ఏది అవసరమో, ఏది అవసరంకాదో తల్లిదండ్రులకు తెలిసేఉంటుంది. ఏది చేసినా అదంతా తన భద్రతకోసం, తనమీద తల్లిదండ్రులకున్న బాధ్యత, మితిమీరిన ప్రేమ అని గుర్తించకుండా.. తామిచ్చే జీతంమీద ఆధారపడి బ్రతికే వ్యక్తితో తను... వెళ్లిపోవడానికి సిద్ధపడింది.

అతను ఎట్లాంటివాడో.. అతని కుటుంబ పరిస్థితులేంటో తెలియదు. అతడు తనను ఎట్లా పోషిస్తాడో తెలియదు. అయినా కొద్దినిముషాల్లో అతన్తో జీవితరైలు ఎక్కబోతోంది.

గదిలో గడియారం ఆరుగంటలైనట్లు చూపిస్తుంది.

వెళ్లాలి..!

కావేరి లేచివెళ్లి సుభద్ర కన్నీళ్లు తుడిచింది. "ఏడవకండి ఆంటీ! అంతా మంచే జరుగుతుంది. చిత్ర కోలుకున్నాక వస్తాను.. ధైర్యం చెప్పడానికి" అని నెమ్మదిగా బయటకు నడిచింది. లిఫ్టులో కిందకు దిగుతుంటే సుభద్ర పలికిన మాట ఆమె మనసులో పదేపదే ప్రతిధ్వనిస్తుంది.

'తమ ఆరోగ్యం, భద్రతకోసం తల్లిదండ్రులు చేసే నియంత్రణను పిల్లలు ప్రేమరాహిత్యంగా భావించి, బయటి వ్యక్తులు దురుద్దేశంతో అందించే తాయిలాలను ప్రేమకానుకగా భావిస్తే.. నిండుజీవితం బండలపాలవుతుంది..'

కఠినంగా అనిపించినా ఎంతోకొంత వాస్తవం ఉంది అందులో.

ఆలోచిస్తుంటే మనసుపొరలపై పరుచుకున్న చీకటితెరలు క్రమక్రమంగా విడివడుతున్నట్లు అనిపించిందామెకు. భవిష్యత్ ప్రపంచం కనులముందు లీలగా దర్శనమిస్తుంటే.. ఎదురుగా వస్తున్న ఆటోను ఆపింది.

ఆమె ఎక్కి కూచోగానే ఆటో పరుగుతీసింది.

అయితే... రైల్వేస్టేషన్ వైపు కాదు! కావేరి ఇంటివైపు !

౦౦౦౦

కటుకోజ్వల మనోహరాచారి,
రచయిత
9441023599.